9:34 PM | 0.0KB/s 49%

MARRI CHETTU...

# మర్రి చెట్టు

" ఓ పెద్దవ్వా ! నువ్వెక్కడ దిగాలే? " కండక్టర్ అడ్గిండు.

" దండెపెల్లిలో దిగుతా బాంచెన్ "

" అయ్యో ముసల్దానా ! మీ ఊరు దాటిచ్చినవ్ "

" ఏంది బాంచెన్ ? ఇంక మర్రి చెట్టు రాకనే పాయే గదా !"

"నీ మర్రి చెట్టును కుక్కలెత్తుకపోయినయ్! గాని దిగు. గిది మ్యాదరిపేట. నీయవ్వ ! చెకినోల్లత్తె నా ఇల్లు మునుగుతది. జల్ది దిగు . హెూల్డాన్ ...హెూల్డాన్ ...గీ ముసల్దాన్నీ దిగనియ్యి" కండక్టర్ కేకేసిండు.

ఇంకోసారి చెప్పే అవసరం రాకుండా... కిర్రుమని బస్సు ఆగింది.

ప్రక్క నున్న ప్రయాణీకుడు " అమ్మా ! గా మర్రి చెట్టును ఎప్పుడో నరికేసింద్రు " అన్నడు.

వెనుకా ముందు ఆలోచించకుండా ...

" ఈనింట్ల పీనుగెల్ల .ఎవల్నేమన్నది? పాపపు గాడిది కొడుకులు, ఎట్ల నరుక బుద్దయింది.

ఆల్ల చేతులకు జెట్టలు వుట్ట . ఆల్లు నాశనమైపోను . సక్కదనాల చెట్టు .సల్లని తల్లి తీరుండే " అని తిట్టుకుంటూ, ఓ చేతిలో బట్టల ముల్లె , ఇంకో చేతిలో కర్రతో బస్సు దిగింది రాజవ్వ.

దాదాపు డెబ్బయి ఎనుబై సంవత్సరాల మధ్య వయస్సుంటుంది. తల మీద ఒక్క నల్ల వెంట్రుక దొరుకదు . నోట్లో పండ్లన్ని వున్నట్టు లేదు. ముక్కుకు పెద్ద ముక్కు పుల్ల. చేతులకు మట్టి గాజులు, వెండి దండ



కడియాలు. కాళ్లకు పట్ట గొలుసులు, నడుముకు ఒడ్డాణం. చెవులకు బరువైన పడిగెలు. బరువుతో చెవులు సాగిపోయి రంద్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చామన చాయ శరీరమే కావచ్చు. కాయకష్టం చేయడంతో

9:34 PM | 0.9KB/s 49%



కడియాలు. కాళ్లకు పట్ట గొలుసులు, నడుముకు ఒడ్డాణం. చెవులకు బరువైన పడిగెలు. బరువుతో చెవులు సాగిపోయి రంధ్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చామన చాయ శరీరమే కావచ్చు. కాయకష్టం చేయడంతో ముడుతలు పడి నల్లగా కనబడుతుంది.

ఆమె వెనుకనే దిగింది రాజవ్వకు చెల్లెలు వరుస.

"ఏమైందే అక్కా ! గట్ల తిట్టవడితివి? స్టేజి మర్సి పోయింది నువ్వు. ఊరు గుర్తు వట్టలేదా? అప్పుడప్పుడు బిడ్డెను జూసేతందుకు అచ్చి అచ్చిపోతుంటవు కదా ! ఇయ్యాల్ల గిట్లెట్లయింది?" అంది.

"బస్సు దిగినంక గోడిసేపు గా చెట్టు కింద గూసుంటే ...మనసు హాయిగనిపిత్తుండె. ఎండల వడత్తె పానం సల్ల వడుతుండే. నా బిడ్డను సూడచ్చినప్పుడల్ల మనూరు బస్సు అచ్చెదాక గా చెట్టు కిందనే కూసునేదాన్ని" రాజవ్వ మనసంత మఱ్ఱి చెట్టు మీదనే వుంది. ఎండలో వేరే వూర్లె దిగినమన్న బాధ కంటే బంగారమసోంటి చెట్టును నరికేస్రనేదే ఎక్కువ బాధ పెడుతుంది.

"బస్సు అచ్చెదాక గాడ ఆప చెట్టు నీడకు కూసుందాం రావే అక్కా ! " అంది.

వెళ్లి రోడ్డు పక్కనున్న చెట్టు నీడకు బండల మీద కూర్చున్నరు. ఎండకు తల మీద కొంగులు కప్పుకొన్నరు.

తమతో తెచ్చుకున్న నీళ్ల బుడ్డి లోని నీళ్లు కొన్ని తాగింది.

" ఇగో గొన్ని నీల్లు తాగే అక్కా ! నోరెండుక పోతది " అంది.

ఎడమ చేత్తో అందుకొని గట గట నాలుగు బుక్కలు తాగిచ్చేసింది.

"సల్లగున్నయానే అక్కా " మాట్లాడిద్దామని అడిగింది.

సమాధానమియ్య లేదు.

" ఇంకొన్ని తాగు " అంది. వద్దన్నట్టు చేతితో సైగ చేసింది రాజవ్వ.

9:34 PM | 0.0KB/s 49%

MARRI CHETTU...

“అవునే అక్కా! ఏ మర్రి చెట్టు ? ఏంది కత ? మనం ఇక్కడ దిగుడుకు , ఊరు దాటచ్చుడుకు గా చెట్టు  నరుకుడుకు సంబంధమేంది? ” అనుమానంగ అడిగింది.

“ నువ్వు ఇంతకు ముందెన్నడు గా చెట్టును సూల్లేదు గదా ! సూత్తె నా కంటే నువ్వె ఎక్కువ బాద పడేదానివి. గా మర్రి చెట్టు ఇయ్యాలటిదా... నిన్నటిదా? నా సిన్నతనం నుంచి జూస్తున్న . ఏ సల్లని తండ్రి గాడు నాటిండో ! సచ్చి ఏ సర్గానున్నడో ! ఎప్పుడు సూసిన పచ్చగుంటుండే. ఊరు నడిమిట్ల నుంచిడాంబరు  రోడ్డు. పక్కకు పెద్ద మర్రి చెట్టు. దాని కొమ్మలు ఎంత పొడుగో చెప్పకిగ. చెట్టు మీద రకరకాల పిట్టలు, రామచిలుకలు, గొర్రింకలు,  కాకులు, ఉడుతలు. పిలగాండ్లు ఊడలు వట్టుకొని ఉయ్యాలూగినట్టు ఊగెటోల్లు. చెట్టు కింద గూసుంటే లెవ్వ బుద్ధి గాకపోవు.

సోమారం అంగడి. ఇగ ఆనాడైతే చెట్టు కింద జాగనే దొరుకది. సుట్టు నాలుగూల్ల మందత్తరు. కాయగూరలు, పప్పు దినుసులు, నూనెలు, నసెం, బజ్జీలు, బోలుపాలాలు, కారప్పూస, గాజులు, చెప్పులజోల్లు, మొగుదాల్లు, పగ్గాలు, నులుక తాల్లు, తనుగులు, దొత్తెలు, చీపుర్లు, అగ్గిపెట్టెలు, పొగాకు, సుట్టలు, బట్టలు, సీరెలు, రయికలు, దోతుల జోడలు, సెడ్డీ బనీన్లు.... గిది గదని ఏమి లేదు. తీరొక్క దుకాన్లుంటయి. చెట్టు కింద జాతర్నె అనుకో.

సుట్టాలు కల్సుకుంటరు. మంచి చెడ్డలు అర్సుకోని, కడుపునిండ మాట్లాడుకుంటరు.  పడుసు పిల్లగాండ్లు సబ్బులు, పొవుడర్లు, అద్దాలు, దువ్వెన్లు, కాటుక డబ్బిలు కొనుక్కపోతరు.

ఎంత ఎండకాలమైన పరేషానేమి లేదు. గీ చెట్టు కాపాడుతుండే. వేరే వూరొల్లకు ఎవలిదన్న ఇల్లు పత్త తెలువక పోతే చెట్టుకాడ ఎవల్నడిగిన సెప్పెటోల్లు.

చెట్టుకు ఓ పక్క చాయి ఓటలుంది. అండ్ల పూరీలు, బజ్జీలు, పకోడి, కార, అటుకులు, లడ్డులు దొరుకుతయి. ఇంటికి పోయెటప్పుడు పిల్లగాండ్లకు ఏదోకటి పొట్లం కట్టిచ్చుక పోతరు.

గా మర్రి చెట్టుతోనే ఆ వూరికి అందం. గంతేగాదు... గా చెట్టు కింద ఎన్నో పంచాయితులు జరుగుతుండే. మన్నెపోల్లు, మాదిగోల్లు, సాకలోల్లు, మంగలోల్లు, కుమ్మరోల్లు, అవుసులోల్లు, వడ్లకమ్మరోల్లు, గౌన్లోల్లు, దూదెకులోల్లు, తురుకోల్లు, తెనుగోల్లు, పెరుకోల్లు, కాపోల్లు... గా కులం గీ కులమని ఏమి లేదు. ఎవలి పంచాయితైనా దీని కిందనే జరుగుతుండే"

"మరి గా ఊల్లె పంచాయితి ఆఫీసు లేదా? "

"ఆ... ఎందుకు లేదు ! ఉన్నది. గక్కడికి ఎవలు పోరు. అందరు గాడ్నే కూసుంటరు. సర్పంచ్ గూడ ఆడికె అత్తడు. ఒకటా రెండా ఎన్నో ఏండ్ల సంది గిట్లనే ...

అత్త కోడండ్ల గుసులాటలు, అన్న దమ్ముల లొల్లి, పాలోల్ల కొట్లాలు, పెండ్లం మొగల్ల జగుడాలు ఏదన్న గాని గీడ తప్పి అయితుండే. చెట్టు మొదలుకు ఆనికొని సర్పంచ్, పటేండ్లు, పెద్ద మనుసులు, కూసుంటరు.. ఇగ అచ్చినోల్లందరు నీడకు కూసుంటరు. దినాల కొద్ది అయితుండే కొన్ని మొండి పంచాయితిలైతే. కొన్ని తెగని కొట్లాటలు వాయిదా ఏసుకొని మల్లోనాడు కూసుందురు.

గప్పుడు పోలీసు టాననా ఎమన్ననా? ఏదున్న పెద్ద మనుసులు చెప్పినట్టు ఇందురు. గప్పటి మనుసులకు నియ్యతుండే. అందుకే బరుకతుండే. మానానికి పడిసత్తురు . పొరుగూరోల్లకు ఆగెతందుకు మంచి సొలతుండే. కరెంటు బిల్లు తీసుకునే సార్లు, పసి పిల్లగాండ్లకు పల్సు సుక్కలేసే దాయమ్మలు గీ చెట్టు కిందనే వుండేటోల్లు.

బస్సులు, లారీలు, జీపులు అన్ని చెట్టు కాడనే ఆగుతయి. గదే బస్టాండు.

ఎండాకాలం గొల్ల రాజన్న సల్లటి నీల్ల కుండలు వెట్టి అచ్చి పోయెటోల్లకు నీల్లిత్తుండే. పెద్ద పెద్ద కాగులల్ల నింపి పెడుతుండే. ఎండల వడచ్చినోల్లు కడుపు నిండ తాగి " రాజన్న నీ కడుపు సల్లగుండ " అని దీవించిపోయేటోల్లు " కండ్లకు కట్టినట్టు వర్ణించింది రాజవ్వ. గదవ కింద చేతులు పెట్టుకొని ఆసక్తిగా వింటుంది రాజవ్వ చెల్లె.

9:35 PM | 0.0KB/s 49%

MARRI CHETTU...

"బసు దిగెటోల్లు , ఎక్కెతందుకచ్చినోల్లు ఎవలో ఒకలు ఎప్పుడు జూసినా మందే చెట్టు కింద.

నాకేమన్న సదువా సందెనా? ఊరు దగ్గరి కత్తుందనిపిత్తె బస్సు కిటికీల నుంచి బయిటికి సూత్తుంటి. మర్రి చెట్టు కొమ్మలు ఎంతన్న దూరం దాక కనవడుతుండే. గట్ల కనవడంగనే మెల్లగా లేసి కండక్టరు దగ్గరికి పోయి నిలవడితే మర్రి చెట్టు కాడ ఆపుతుండే. గట్ల గా చెట్టచ్చిందంటే దండేపెల్లి ఊరచ్చిందని ఎరుకైతుండే.

ఇయ్యాల్ల సుగ గట్లనే సూసుకుంట కూసున్న. చెట్టు ఇంక రాలేదని బస్సు దిగలేదు. నేను ఈ నడుమ రాక బాగొద్దులైంది. నా తీరు ఎంత మంది ముసులోల్లు కాదువద్దరో ! పాపం మనస్సోంటి సదువు రానోల్లకు గా చెట్టే గుర్తు " రాజవ్వ చెప్తుండగానే దండేపెల్లి వెళ్లె బస్సు వచ్చింది. ఇద్దరు బసెక్కి ఊర్లె దిగిన్రు.

బస్సు దిగుడే ఆలస్యం.... రాజవ్వ దబ దబా వెళ్లి ఆ మర్రి చెట్టు ఉండే చోట కొద్ది సేపు సంతాపం ప్రకటించినట్లు మౌనంగా, విచారంగా, నిల్సోని అటు ఇటు చూసింది.

చెట్టు నరికి వేయగ మిగిలిన మొదలు పైన గడ్డి వేసి కాల్చేసిన బూడిద తప్ప ఏమి  లేదు. ఒకనాటి అందం కనిపించలేదు రాజవ్వకు. "బోసి పోయింది ఊరు" అనుకుంది లోలోన.

"నీ ఊరు గాదు, నీ జాగ గాదు. నీకెందుకు ? పా... ఇంటికి పోదాం " అనడంతో ఇంటి వైపు నడక మొదలు పెట్టింది. అటు ఇటు చూసుకుంటూ రాజవ్వ బిడ్డ ఇంటికి చేరుకున్నారు.

"అవ్వా ! మంచిగున్నవా ! అయ్య మంచిగున్నడానే ? " అంటు చేతిలోని బట్టల ముల్లె తీసుకుంది. ఔనన్నట్టు తల ఊపింది రాజవ్వ.

"ఏమే చిన్నవ్వ ఇంటికాడ అందరు మంచిగున్నరా! అడ్గింది రాజవ్వ బిడ్డ.

"ఆ... బిడ్డ అందరు మంచిగున్నరు. నువ్వెట్లున్నవూ. అల్లుడు, మనుమలు, మనుమరాండ్లు మంచి గున్నరా? "

9:35 PM | 0.0KB/s 49%
MARRI CHETTU...

"గా మర్రి చెట్టును ఎవలు నరికిన్రు? అదేమన్నది ? ఎవని సొమ్ము తిన్నది? " రాజవ్వ బిడ్డతోని అనుకుంటు వెళ్లి అరుగు గద్దె మీద కూలబడ్డది.

" ఏ మర్రి చెట్టు? " బిడ్డ అడిగింది.

"బస్టాండు కాడిది " రాజవ్వ చెల్లె చెప్పింది.

"గా చెట్టు సంగతి నీకిపుడెందుకే ? అవ్వా ! "

"బిడ్డా ! ఊరికె గాని, ఇంటికే గాని చెట్లతోనే అందం. మీ ఊరికి ఆ చెట్టుతోనే శోబ వుండే. ఇప్పుడంత బోడి బోడి అనిపిత్తంది.

"మొన్నీమధ్య రోడ్లు వెడల్పు చేసెటోల్లు గా చెట్టు రోడ్డుకు నడుమట్లచ్చిందని నరికేసిన్రు" అంది బిడ్డ.

"ఈని రోడు మీద మన్నువడ... గా చెట్టు అడ్డమచ్చిందా? దాన్ని తప్పిచ్చి ఎయ్యరాక పోయిందా? మస్తు జాగుంది గదా ! సక్కదనపు చెట్టును పొట్టనవెట్టుకున్నరు" అంటు బిడ్డ తెచ్చిన చెంబెడు నీళ్లు గటగట తాగి, ఇంట్లకు నడ్చింది రాజవ్వ. వెనుకాల వెళ్లింది రాజవ్వ చెల్లెలు.

*నమస్తె తెలంగాణ (బతుకమ్మ) 20 అక్టోబర్ 2013*

*రంది కథ సంకలనం 2013*